దిన పత్రిక
తొలి సమయం
వాస్తవమే గమ్యం! గమనం!!
మంగళవారం । 14 । జూలై । 2026

# గూడూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థినికి బాసరలో ఐఐఐటి సీటు

### 547 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచి

### మరోసారి ప్రభుత్వ విద్య ప్రతిభ చాటిన మాలోతి దివ్య

**తొలి సమయం కొత్తగూడ 13 జూలై 2026**



గూడూరు మండల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని మాలోతి దివ్య ప్రతిభ కనబరిచి ప్రతిష్ఠాత్మక బాసరలో సీటు సాధించింది. 202526 విద్యా సంవత్సరానికి చెందిన ఎస్‌ఎస్‌సీ పరీక్షల్లో 547 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచిన దివ్య, ఇప్పుడు బాసరకు ఎంపిక కావడంతో పాఠశాలకు మరో గౌరవాన్ని తీసుకొచ్చింది.గత విద్యా సంవత్సరంలో గూడూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించి విశేష గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. తాజాగా దివ్య సాధించిన ఈ విజయం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మరింత స్ఫూర్తినిచ్చేలా నిలిచింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని మాలోతి దివ్యను అభినందించి, ఆమె ఉన్నత విద్యలోనూ ఇదే ప్రతిభను కొనసాగించాలని ఆకాంక్షించారు. గూడూరు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) ఆడెపు సుజాత మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ప్రతిభకు తగిన అవకాశాలు లభిస్తున్నాయని, విద్యార్థులు కష్టపడి చదివితే వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధించడం సాధ్యమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

# మోడల్ స్కూల్ హాస్టళ్లలో పలు ఖాళీలు

### జూలై 15 వరకు దరఖాస్తులకు అవకాశం

**తొలి సమయం మహబూబాబాద్ 13 జూలై 2026**



మహబూబాబాద్ జిల్లాలోని మోడల్ స్కూల్ బాలికల హాస్టళ్లలో ఖాళీగా ఉన్న పలు పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. సత్యానారాయణ తెలిపారు.జిల్లాలోని మహబూబాబాద్, నెల్లికుదురు, తొర్రూరు (గుర్తూరు), కేసముద్రం (కల్వల) మోడల్ స్కూల్ బాలికల హాస్టళ్లలో ఏఎన్‌ఎం, అసిస్టెంట్ కుక్1, అసిస్టెంట్ కుక్2, కేర్‌టేకర్ కమ్ వార్డెన్, హెడ్ కుక్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. సంబంధిత పోస్టులకు అవసరమైన విద్యార్హతలు కలిగి, మహబూబాబాద్ జిల్లా వాస్తవ్యులైన అభ్యర్థులు జూలై 11 నుంచి జూలై 15 సాయంత్రం 4 గంటల వరకు తమ దరఖాస్తులను సంబంధిత మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.పోస్టులకు సంబంధించిన పూర్తి అర్హతలు, నిబంధనలు మరియు ఇతర వివరాల కోసం జీఈసీఓ () వై. గాయత్రిను 9441065068 నంబర్‌లో సంప్రదించవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు.

# వరంగల్ గ్రేటర్ ప్రెస్ క్లబ్‌కు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలి

### అక్రమాలపై విచారణ జరిపి క్లబ్‌ను ప్రక్షాళన చేయాలి

### హన్మకొండ జిల్లా కలెక్టర్‌కు డబ్ల్యూ జే ఐ నాయకుల వినతి



**తొలి సమయం డెస్క్ జులై 13 (పీపుల్స్ డైరీ) :**
వరంగల్ గ్రేటర్ ప్రెస్ క్లబ్‌కు సకాలంలో ఎన్నికలు నిర్వహించాలని, క్లబ్‌ను పూర్తిగా ప్రక్షాళన చేయాలని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా () డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం హన్మకొండ జిల్లా కలెక్టర్‌కు నాయకులు ఒక మెమోరాండం అందజేశారు.నిబంధనలకు విరుద్ధంగా ప్రెస్ క్లబ్ నిర్వహణ కొనసాగుతోందని, సత్వరమే ప్రజాస్వామ్య విధానంలో ఎన్నికలు నిర్వహించాలని వారు ఆ వినతిపత్రంలో కోరారు. ప్రస్తుత కమిటీ ఎన్నికై మూడున్నరేళ్లు గడుస్తున్నా.. ఇంతవరకు ఒక్కసారి కూడా జనరల్ బాడీ సమావేశం నిర్వహించలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. బైలాను అతిక్రమించి, ప్రెస్ క్లబ్ మెంబర్షిప్ ఇవ్వడంలో కూడా తీవ్ర వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఎలాంటి వివక్ష లేకుండా ప్రెస్ క్లబ్ సభ్యత్వం కల్పించాలని డిమాండ్ చేశారు.ఇప్పటివరకు ప్రెస్ క్లబ్‌లో జరిగిన లావాదేవీలపై ప్రభుత్వం ద్వారా సమగ్ర విచారణ జరిపించి, క్లబ్‌ను ప్రక్షాళన చేయాలని వారు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో స్టేట్ సెక్రటరీ నారా సుబ్రహ్మణ్యేశ్వరరావు (ఎన్.ఎస్.రావు), జిల్లా నాయకులు సిరికొండ భాస్కర్, నంబూద్రిపాద్, గుంటి విద్యాసాగర్, ఎండీ షంసుద్దీన్, రమేష్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

### సొంత జీతంతో పేద విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ



**తొలి సమయం తొర్రూరు 13 జూలై 2026**
పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఇచ్చిన హామీని ఆచరణలో నిలబెట్టుకుంటూ, తన సొంత జీతంతో పేద విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ అందించి మరోసారి సేవాభావాన్ని చాటుకున్నారు. తొర్రూరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హనుమండ్ల ఝాన్సీ రెడ్డి సహకారంతో గత 45 రోజులుగా నిర్వహించిన కంప్యూటర్ శిక్షణా కార్యక్రమం విజయవంతంగా పూర్తికాగా, శిక్షణ పొందిన విద్యార్థులకు సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు.ఉద్యోగ అవకాశాలు, ఉన్నత విద్యలో కంప్యూటర్ పరిజ్ఞానం కీలకమనే ఉద్దేశంతో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తన నెలవారీ జీతంలో నుంచి నిధులు కేటాయించి ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థులకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన కంప్యూటర్ శిక్షణ అందించడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు.ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, ఉచితంగా కంప్యూటర్ శిక్షణతో పాటు సర్టిఫికెట్ పొందడం తమ విద్యాభ్యాసం, ఉపాధి అవకాశాలకు ఎంతో దోహదపడుతుందని ఆనందం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు సైతం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుని చేతల్లో చూపించడం ప్రజాప్రతినిధిగా ఆమె నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు.

# నా భూమిలో నన్ను వ్యవసాయం చేయనీయకుండా అడ్డుకుంటున్న నా తమ్ముడు

**తొలి సమయం మహబూబాబాద్ జూలై 13:**
మా తండ్రి నాకు పంచి ఇచ్చిన వాటలో నన్ను వ్యవసాయం చేయకుండా నా తమ్ముడు జాటోత్ మనోహర్ అడ్డుకుంటున్నాడని జాటోత్ మంజీలాల్ ప్రజా వాణి లో దరఖాస్తు ఇచ్చారు..మంజిలాల్ దరఖాస్తు వివరాలు ఇలా ఉన్నాయి.. మా తండ్రికి ముగ్గురు కుమారులు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.. పెద్ద వంగర మండలం రామచంద్రు తండాలో గత 60 సంవత్సరాలుగా వ్యవసాయ వృత్తిపై ఆధార పడి జీవిస్తున్నాం.. మా నాన్నగారు దళపతి సంపాదించిన ఆస్తిని ముగ్గురు కొడుకులుగా పంచుకున్నాం, నా వాటాకు 4-20 గుంటలు ఒచ్చింది. ఇందులో నుండి నా కూతురు వివాహ నిమిత్తమై నా తమ్ముడు మనోహర్ కు 1-3 3గుంటలు అమ్మినాను మిగిలిన 2-27 గుంటల భూమి నా వాటాకు ఉన్నది, ఇందులో 1-17 గుంటల భూమి మాత్రమే రెవెన్యూ రికార్డుల్లో ఉన్నది మిగతా మిగిలిన 1-10 గుంటలు భూమి నా చిన్న తమ్ముడు జాటోత్ మనోహర్ భార్య జాటోత్ రుక్మిణి పేరున కలదు అయితే రుక్మిణి పేరున ఉన్న భూమిపై నేను మోకపై ఉన్నాను నా పేరున మార్చుమనీ జాటోత్ రుక్మిణి ని కోరగా నిరాకరిస్తూ నిర్లక్ష్యంగా మాట్లాడుతుంది.. రుక్మిణి తో పాటు జాటోత్ రాజేశ్వరి లు ఇద్దరు కలిసి పెద్ద మనుషుల ముందే తాడికి దిగారని అన్నారు నా వ్యవసాయ భూమిలోకి ట్రాక్టర్ను వెళ్ళనీయకుండా అడ్డుకుంటున్నారు అడ్డుకుంటున్నారు.. ఇట్టి విషయం పెద్దవంగర పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాను.. మా ఇద్దరి తమ్ముళ్ళు మా నాన్నగారు ఇచ్చిన వాటా భూమిలో వారు వ్యవసాయం చేసుకుంటున్నారు.. కానీ నా వాటాకు వచ్చిన భూమిలో వ్యవసాయం చేయకుండా అడ్డుకుంటున్నారు.. ఇద్దరి తమ్ముళ్లలో ఒక తమ్ముడు మనోహర్ ప్రభుత్వ అగ్రి కల్చర్ డిపార్ట్మెంట్లో ఉద్యోగిగా పనిచేస్తూ అధికంగా బలంగా ఉన్నాడని అన్నారు, ఇతను పంచాయితీ పరిష్కారం కాకుండా ఇంఫ్లూయెన్స్ చేస్తున్నాడు అని అన్నారు. మా నాన్నగారికి జన్మించిన ముగ్గురు కొడుకుల్లో నేను పెద్దవాడిని అనే కనీస నైతికత లేకుండా, నాన్న ఇచ్చిన భూమిలో నన్ను వ్యవసాయం చేసుకోనవ్వకుండా వేధిస్తున్నాడని అన్నారు కనుక అధికారులు వెంటనే ఈ సమస్య పూర్వపరాలను ఆలోచించి న్యాయం చేయగలరని పెద్ద కుమారుడైన జాటోత్ మంజీలాల్ కోరుకుంటున్నారు..

# మన ఊరు మన బాధ్యతతో సామాజిక చైతన్యం..

### రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్న గ్రామాలు

**తొలి సమయం మహబూబాబాద్ 13 జూలై 2026**
జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో శాంతిభద్రతలు, రహదారి భద్రత, నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలనతో పాటు ప్రజల్లో సామాజిక బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న మన ఊరుమన బాధ్యత కార్యక్రమం జిల్లావ్యాప్తంగా విశేష విజయాన్ని సాధిస్తోంది. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, యువత పోలీసు శాఖతో కలిసి చురుకుగా పాల్గొనడంతో ఈ కార్యక్రమం ఆదర్శప్రాయంగా నిలుస్తోందనీ జిల్లా ఎస్పీ డా. పి. శబరీష్, ఐపీఎస్ అన్నారు. మే నెలలో తొలి విడతగా 36 గ్రామపంచాయతీలు, 13 వార్డుల్లో, జూలైలో రెండో విడతగా 54 గ్రామపంచాయతీలు, 4 వార్డుల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 100కు పైగా గ్రామపంచాయతీలు, వార్డుల్లో స్థానిక సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, గ్రామ కమిటీలు, ప్రజల సహకారంతో ఆయా పోలీస్ స్టేషన్ల సబ్ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో పోలీసులు ఇంటింటికీ వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా భారీ హెల్మెట్ బైక్ ర్యాలీలు, అవగాహన సమావేశాలు నిర్వహించి రహదారి భద్రత, గంజాయి సహా మాదకద్రవ్యాల నివారణ, సీసీ కెమెరాల ప్రాధాన్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు.గార్ల మండలం గోపాలపురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డా. పి. శబరీష్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై హెల్మెట్ అవగాహన బైక్ ర్యాలీని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, భద్రతలో ప్రజల భాగస్వామ్యమే కీలకమని అన్నారు. నో హెల్మెట్.. నో ఎంట్రీ, గంజాయి రహిత గ్రామాల ఏర్పాటు, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు వంటి స్వచ్ఛంద నిర్ణయాలు సమాజంలో సానుకూల మార్పుకు నాంది పలుకుతున్నాయని




పేర్కొన్నారు.యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ప్రతి గ్రామం గంజాయి రహిత గ్రామంగా మారేందుకు ప్రజలందరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. రహదారి ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, గ్రామ భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు విస్తృతంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఫ్రేమ్ వద్ద యువత, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో సంతకాలు చేసి గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, తమ గ్రామాన్ని గంజాయి రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని, చట్టాలను గౌరవిస్తామని ప్రతిజ్ఞ చేశారు. గ్రామాల్లో శాశ్వతంగా ఏర్పాటు చేసిన ఈ ఫ్రేమ్ ప్రతిరోజూ గ్రామస్తులకు వారి ప్రతిజ్ఞను గుర్తుచేస్తూ సామాజిక బాధ్యతను మరింత బలోపేతం చేయనుంది.స్థానిక సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, గ్రామ కమిటీలు, యువత పోలీసు శాఖకు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్న జిల్లా ఎస్పీ, మహబూబాబాద్ జిల్లా గ్రామాలు తీసుకుంటున్న ఈ చారిత్రాత్మక నిర్ణయాలు రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువతపెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రతే లక్ష్యం.. ఏకలవ్య విద్యార్థులకు పోలీసుల ప్రత్యేక అవగాహన



**తొలి సమయం కురవి, 13 జూలై 2026**
విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన పెంపొందించడంతో పాటు మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, రోడ్డు భద్రత, సామాజిక బాధ్యతలపై చైతన్యం కల్పించేందుకు మహబూబాబాద్ జిల్లా పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. పి. శబరిష్, ఐపీఎస్ ఆదేశాల మేరకు సోమవారం కురవి మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్‌లో ఈ కార్యక్రమం జరిగింది. కురవి పోలీస్ స్టేషన్ ఎస్ఐ సతీష్, భరోసా కేంద్రం ఎస్ఐ కుమారి దీపికా రెడ్డి మరియు షీ టీం సిబ్బంది సంయుక్తంగా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులు మంచి నడవడిక, క్రమశిక్షణతో మెలుగుతూ చదువులపై పూర్తి దృష్టి సారించాలని సూచించారు. చెడు స్నేహాలు, మత్తు పదార్థాలు, డ్రగ్స్, మద్యపానం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, మైనర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపకూడదని, రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని వివరించారు.అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. అపరిచితులతో వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం, ఓటీపీ వంటి గోప్యమైన సమాచారాన్ని పంచుకోవద్దని హెచ్చరించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.ఈ సందర్భంగా మహబూబాబాద్ షీ టీం 8712656935, అత్యవసర సేవలు 100/112, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, మహిళల హెల్ప్‌లైన్ 181, 1091 నంబర్ల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ బి. లాలు, అధ్యాపకులు, షీ టీం ఏఎస్ఐ సుధాకర్,కానిస్టేబుళ్లు రమేష్, పార్వతి, ప్రియాంక, భరోసా సిబ్బంది జోష్న, రేణుకతో పాటు సుమారు 450 మంది విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొన్నారు.విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన, మహిళల భద్రత, సైబర్ భద్రత, రోడ్డుభద్రతతోపాటుబాధ్యతా యుతమైన పౌరులుగా ఎదిగేలా ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని పోలీసులు తెలిపారు.

# దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తాం: ఉత్తమ్, పొంగులేటి

### పెండింగ్ బిల్లులు విడుదల.. అసెంబ్లీలో చర్చకు సిద్ధమని స్పష్టం

**తొలి సమయం ములుగు 13 జూలై 2026**
దేవాదుల ఎత్తిపోతల పథకానికి అవసరమైన భూసేకరణను పూర్తిస్థాయిలో చేపట్టి, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టులో 38.16 క్యూసెక్కుల సామర్థ్యానికి సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేస్తామని ఆయన ప్రకటించారు.గోదావరి జలాలను సమర్థంగా వినియోగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే అత్యధిక సాగు విస్తీర్ణం సాధించి, వరి ఉత్పత్తిలో రికార్డులు సృష్టించామని ఉత్తమ్ పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో రికార్డు స్థాయిలో పంటలు పండాయని, ఒక్క యాసంగి సీజన్‌లోనే 84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందని వెల్లడించారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కమిషన్ల కోసం ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని, బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయకుండా ఇప్పుడు విమర్శలు చేయడం సరికాదన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నేరుగా శ్రీపాద ఎల్లంపల్లి వరకు నీటిని తరలించడం సాంకేతికంగా సాధ్యం కాదని జాతీయ, అంతర్జాతీయ నిపుణులు కూడా స్పష్టం చేశారని తెలిపారు. ప్రజలు గత ప్రభుత్వ పనితీరును గమనిస్తున్నారని, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులకు బీఆర్ఎస్ పాలనే కారణమని విమర్శించారు.అదే కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, దేవాదుల ప్రాజెక్టు



ద్వారా 6.14 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పెండింగ్ బిల్లులను కొద్ది గంటల్లోనే విడుదల చేస్తామని, కాంట్రాక్టర్లు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. దేవాదుల ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేసిన ఆయన, బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమని అన్నారు. లిఫ్టులను గేట్లు దించకుండానే నడపవచ్చన్న వ్యాఖ్యలు పూర్తిగా అసత్యమని, దీనిని త్వరలోనే ఆధారాలతో నిరూపిస్తామని పేర్కొన్నారు.అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, గత ప్రభుత్వ అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే తమపై ఆరోపణలు చేస్తున్నారని పొంగులేటి విమర్శించారు. దేవాదుల ప్రాజెక్టుపై అసెంబ్లీలో ఎప్పుడైనా చర్చకు సిద్ధంగా ఉన్నామని, ప్రతిపక్షం కూడా చర్చకు రావాలని సవాల్ విసిరారు. ప్రజలను తప్పుదోవ పట్టించే అసత్య ప్రచారాలను విరమించాలని ఆయన కోరారు.

# గ్రీన్ రిసార్ట్స్‌లో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

### - ఆరుగురు పట్టివేత.. నగదు, సెల్‌ఫోన్లు, బైక్‌లు స్వాధీనం



**తొలి సమయం కొత్తగూడ 13 జూలై 2026**
నర్సంపేట పట్టణంలోని గ్రీన్ రిసార్ట్స్‌లో పేకాట నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఆకస్మికంగా దాడి నిర్వహించారు. రిసార్ట్స్‌లోని ఓ గదిలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి రూ.12,091 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, మూడు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# హెల్మెట్ ఉంటేనే భద్రత.. బావురుగొండలో పోలీసుల అవగాహన బైక్ ర్యాలీ



**తొలి సమయం కొత్తగూడ 13 జూలై 2026**
రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గంగారం మండలం బావురుగొండ గ్రామంలో సోమవారం పోలీసులు ఆధ్వర్యంలో హెల్మెట్ అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై కోటేశ్వర్ రావు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ అనేది కేవలం ట్రాఫిక్ నిబంధన కాదని, ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని తెలిపారు. వాహనం నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమాలను పాటించడం, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌కు దూరంగా ఉండడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. ర్యాలీలో గ్రామ సర్పంచ్ ముడిగ వీరభద్ర పోతయ్య, గంగారం ఏఎస్ఐ, మాజీ సర్పంచ్ ఈసం సమ్మయ్య, ఉపసర్పంచ్ వజ్జ సురేష్, ముడిగ విజయ్ కుమార్, వార్డు సభ్యుడు ఈక నరేష్, ఇతర వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, ద్విచక్ర వాహనదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అందరూ హెల్మెట్లు ధరించి ర్యాలీలో పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం గ్రామ ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం పెంపొందించడంలో కీలకంగా నిలిచిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# హత్యలకు ముందు వీడియో రికార్డ్ చేసిన రాజ్‌కుమార్

### సంచలన విషయాలు వెల్లడి



**తొలి సమయం హైదరాబాద్ 13 జూలై 2026**
భార్యతో పాటు మరో వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడు రాజ్‌కుమార్ హత్యలకు ముందు వీడియో రికార్డ్ చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి వెల్లడించారు.రాజ్‌కుమార్ మృతదేహం వద్ద లభించిన మొబైల్ ఫోన్‌ను పరిశీలించగా, జూలై 10న సాయంత్రం 4:55 గంటలకు అతడు ఓ వీడియోను రికార్డ్ చేసినట్లు గుర్తించినట్లు సీపీ తెలిపారు.ఆ వీడియోలో రాజ్‌కుమార్ మాట్లాడుతూ, సంపాదించిన దాంట్లో సగం వాళ్లకే పెట్టాను. నా దగ్గరున్న డబ్బంతా వసూలు చేసి నన్ను నష్టపరిచారు. నా పిల్లలకు ఉండాల్సిన భూమి కూడా లేకుండా చేసుకున్నాను. ఓ అమ్మాయిని నమ్మి అప్పుల పాలయ్యాను. చివరికి నాపై కేసు పెట్టి జైలుకు పంపించాలని చూస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేసినట్లు సీపీ వెల్లడించారు.ఈ వీడియోను పోలీసులు కేసు దర్యాప్తులో కీలక ఆధారంగా పరిగణించి అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.

దిన పత్రిక
తొలి సమయం
మంగళవారం । 14 । జూలై । 2026

# సీతానగరం ఎంపీపీఎస్‌లో నులిపురుగుల నివారణ మందుల పంపిణీ

**విద్యార్థుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి: ప్రధానోపాధ్యాయులు పులి దేవేందర్ ముదిరాజ్**



**తొలి సమయం కొత్తగూడ 13 జూలై 2026**

గూడూరు మండలం సీతానగరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సహకారంతో పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసి వేయించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, విద్యార్థుల శారీరక ఎదుగుదల, పోషకాహార శోషణ మెరుగుపడేందుకు నులిపురుగుల నివారణ అత్యంత కీలకమని అన్నారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించడం అవసరమని తెలిపారు. తల్లిదండ్రులు నులిపురుగుల నివారణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, అవసరమైన సూచనల కోసం స్థానిక ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు దేవి, ఏఎన్ఎంలు ఈశ్వరమ్మ, రమ్య, ఆశా కార్యకర్తలు కవిత, పద్మ, అంగన్‌వాడీ టీచర్ కమల, అటెండర్ వీరమ్మతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఆరోగ్య సిబ్బంది విజయవంతంగా నిర్వహించారు.

# జోనల్ పోలీస్ డ్యూటీ మీట్‌లో మహబూబాబాద్ పోలీసుల సత్తా

**16 పతకాలతో జిల్లాకు గౌరవంపతక విజేతలను అభినందించిన జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్..**

**రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్ష**





**తొలి సమయం మహబూబాబాద్, 13 జూలై 2026**

భద్రాద్రి జోన్- పోలీస్ డ్యూటీ మీట్2026లో విశేష ప్రతిభ కనబరిచి మొత్తం 16 పతకాలు సాధించిన మహబూబాబాద్ జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అభినందించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పీటీసీ మామ్నూర్లో ఈ నెల జూలై 7 నుంచి 9 వరకు నిర్వహించిన జోనల్ పోలీస్ డ్యూటీ మీట్‌లో మహబూబాబాద్ జిల్లా పోలీసులు వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 4 స్వర్ణ, 6 రజత, 6 కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పతక విజేతలను సన్మానించిన ఎస్పీ మాట్లాడుతూ, వారి కృషి, నైపుణ్యం జిల్లా పోలీస్ శాఖకు మంచి గుర్తింపు తీసుకొచ్చిందని కొనియాడారు. ఇదే పట్టుదలతో భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. స్వర్ణ పతక విజేతలుఎస్ఐ సి. హెచ్. అరుణ్ కుమార్ ప్రోగ్రామింగ్ ఎబిలిటీబి. రామయ్య బాంబ్ స్క్వాడ్ (రూమ్ సెర్చ్)కె. ఈశ్వర్ (రుద్ర) డాగ్ స్క్వాడ్ (ఎక్స్‌ప్లోజివ్)సి. హెచ్. రాకేష్ (లూసీ) డాగ్ స్క్వాడ్ (ట్రాకర్)రజత పతక విజేతలుకె. మధు పోలీస్ పోర్ట్రెయిట్‌పి. సుమన్ కంప్యూటర్ అవేర్‌నెస్ఎండీ. అబ్దుల్ ఖదీర్ ఆఫీస్ ఆటోమేషన్ఎన్. చిరంజీవి, బి. సాయి కుమార్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కె. కుశల్ కుమార్ పోలీస్ వీడియోగ్రఫీజి. అశోక్ బాంబ్ స్క్వాడ్ (రూమ్ సెర్చ్)కాంస్య పతక విజేతలుఎస్. విఠల్ లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్ ఆఫ్ ఎగ్జిబిట్స్‌బి. శంకర్ నాయక్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ అండ్ లాస్ఎండీ. అబ్దుల్ ఖదీర్ ప్రోగ్రామింగ్ ఎబిలిటీబి. రామయ్య బాంబ్ స్క్వాడ్ (వెహికల్ సెర్చ్)ఎ. మహేష్ బాంబ్ స్క్వాడ్ (గ్రౌండ్ సెర్చ్)ఎ. హరీష్ కుమార్ (చార్లీ) డాగ్ స్క్వాడ్ (ట్రాకర్)జోనల్ పోలీస్ డ్యూటీ మీట్‌లో 16 పతకాలు సాధించడం ద్వారా మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లిన విజేతలందరికీ జిల్లా ఎస్పీ డా. శబరీష్ మరోసారి అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో సేవలందించాలని సూచించారు.

# హెల్మెట్ ప్రాణరక్షక కవచం... పోలీసుల భారీ అవగాహన బైక్ ర్యాలీ





**తొలి సమయం కొత్తగూడ 13 జూలై 2026**

హెల్మెట్ ఫ్యాషన్ కోసం కాదు... మీ కుటుంబం కోసం అంటూ ప్రజల్లో చైతన్యం నింపిన పోలీసులుగూడూరు మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీసులు సోమవారం భారీ హెల్మెట్ అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ లేకుంటే ప్రయాణమే ప్రమాదం, హెల్మెట్ ఫ్యాషన్ కోసం కాదు... ప్రాణరక్షణ కోసం అనే సందేశాలతో నిర్వహించిన ఈ ర్యాలీ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. జిల్లా ఎస్పీ డా. శబరిష్, ఐపీఎస్ ఆదేశాల మేరకు గూడూరు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గూడూరు సీఐ వినయ్ కుమార్, ఎస్సై గిరిధర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. గూడూరు ప్రధాన వీధుల గుండా సాగిన ర్యాలీలో పోలీసులు, యువత, వాహనదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హెల్మెట్ ధరించండి... సురక్షితంగా ఇంటికి చేరండి, మీ ప్రాణం మీ కుటుంబానికి అమూల్యం, నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలకు చెక్ వంటి నినాదాలతో ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ వినయ్ కుమార్ మాట్లాడుతూ, వేగం మనల్ని త్వరగా గమ్యానికి చేర్చవచ్చు... కానీ నిర్లక్ష్యం క్షణాల్లో జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తుంది. హెల్మెట్ ఫ్యాషన్ కోసం కాదు... ప్రాణాలను కాపాడే రక్షణ కవచం అని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకపోవడం వల్లే ఎక్కువ మంది తీవ్ర తల గాయాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని సూచించారు. ఒక్క క్షణం నిర్లక్ష్యం... జీవితాంతం విషాదం కాకముందే హెల్మెట్ ధరించండి. సురక్షిత ప్రయాణమే మీ కుటుంబానికి మీరు ఇచ్చే గొప్ప బహుమతి అంటూ పోలీసులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ అవగాహన ర్యాలీకి స్థానిక ప్రజలు విశేష స్పందన తెలిపారు.

# వ్యసనాలకు దూరమే విజయానికి తొలి అడుగు



**తొలి సమయం, వనపర్తి, జులై 13**

యాంటీ డ్రగ్ సోల్జర్‌లుగా విద్యార్థులు ముందుకు రావాలి. 400 మంది విద్యార్థులతో పోలీసుల అవగాహన కార్యక్రమం మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటమే ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు మార్గమని, ప్రతి విద్యార్థి యాంటీ డ్రగ్ సోల్జర్‌గా మారి సమాజంలో చైతన్యం తీసుకురావాలని వనపర్తి డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ నాయక్ పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం వనపర్తి ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలన, విద్యార్థినుల భద్రత, మహిళల రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పతకాలు, యాంటీ డ్రగ్ సోల్జర్ సర్టిఫికెట్లను డీఎస్పీ బాలాజీ నాయక్, ఎస్సై అంజాద్, కళాశాల ప్రిన్సిపాల్ నవీన, వైస్ ప్రిన్సిపాల్ సంయుక్తంగా అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీ నాయక్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే సామాజిక మహమ్మారి అని పేర్కొన్నారు. ఒకసారి వ్యసనాలకు బానిసైతే విద్య, ఆరోగ్యం, కుటుంబ బంధాలు, జీవిత లక్ష్యాలన్నీ దెబ్బతింటాయని హెచ్చరించారు. యువత తమ లక్ష్యాలపై దృష్టి సారించి వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థినుల భద్రతపై కూడా అవగాహన కల్పించిన ఆయన.. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, సైబర్ వేధింపులు వంటి ఘటనలు ఎదురైతే భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ప్రభుత్వం అందుబాటులో ఉంచిన 1908 టోల్‌ఫ్రీ సేవలను అవసరమైనప్పుడు వినియోగించుకోవాలని తెలిపారు. మహిళల భద్రత, యువత సంక్షేమం, మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసు శాఖ కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొనగా, సుమారు 400 మంది విద్యార్థులు హాజరయ్యారు.

# ఘనంగా జన జాగరణ యాత్ర






**ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్‌కు వినతిపత్రం సమర్పించిన టి ఎస్ సి పి ఎస్ ఈ యు**

**- ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమే**

**- వారి సామాజిక భద్రత రాష్ట్రానిదే..**

**- సిపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ**

**తొలి సమయం మహబూబాబాద్ జూలై 12:**

తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన జాగరణ యాత్ర ఈరోజు మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా సిపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్,జిల్లా అధ్యక్షులు నాగముని, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు లక్ష్మీకాంత్, జిల్లా కోశాధికారి కొప్పుల నాగరాజు రాష్ట్ర నాయకులు అవునూరి రవి,మోబిన్ అహ్మద్,రవిచంద్ర, శ్రీకాంత్ నాయక్ సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో గౌరవ శాసనసభ్యులు శ్రీ భూక్య మురళి నాయక్ గారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సిపీఎస్ యూనియన్ సంఘ నాయకులతో దాదాపు 20 నిమిషాలకు పైగా సుదీర్ఘంగా చర్చించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి: రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞవినతిపత్రం సమర్పించిన అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ మాట్లాడుతూ... ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ () విధానాన్ని వెంటనే రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని () పునరుద్ధరించాలని కోరారు. గతంలో ఇతర కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాజస్థాన్, ఛత్తీస్గఢ్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకెళ్లారు. సిపిఎస్ ఉద్యోగుల భవిష్యత్తు ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు సిపిఎస్ ఉద్యోగులకు బకాయిలు (), ఈహెచ్ఎస్ () వంటి కనీస సౌకర్యాలు వర్తించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.

ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాను: ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్‌ఉద్యోగుల సమస్యలపై ఎమ్మెల్యే శ్రీ భూక్య మురళి నాయక్ గారు సానుకూలంగా స్పందించారు. పదవీ విరమణ తర్వాత ఉద్యోగికి కేవలం రూ. 2,000 నుండి రూ. 4,000 వరకు మాత్రమే పెన్షన్ వస్తే వారి జీవితం అగమ్యగోచరంగా మారుతుందన్న విషయాన్ని ఆయన అంగీకరించారు. సిపిఎస్ ఉద్యోగుల పట్ల ఇది అత్యంత న్యాయమైన సమస్య అని, దీనిని తప్పకుండా గౌరవ ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లి, సానుకూల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఘనంగా బైక్ ర్యాలీ చలో హైదరాబాద్ పిలుపుఅనంతరం జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్ నుండి నెహ్రూ సెంటర్ మీదుగా కోర్ట్ సెంటర్ వరకు సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సిపిఎస్ ఉద్యోగుల సభలో రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ మాట్లాడుతూ... రాబోయే ఆగస్టు 23న నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లాలోని ప్రతి సిపిఎస్ ఉద్యోగి మరియు ఉపాధ్యాయుడు తమ కుటుంబాల భద్రత కోసం, పాత పెన్షన్ సాధన కోసం ఈ బహిరంగ సభకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లికార్జున్, చంద్రకాంత్, ప్రవీణ్ కుమార్, వెంకటేష్, తెలంగాణ జాక్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు వడ్డెబోయిన శ్రీనివాస్, పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు మిరియాల సతీష్ రెడ్డి, శ్రీధర్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి, డి టి ఎఫ్, టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బలాష్టి రమేష్, నాయకులు సైదుల్ రెడ్డి, ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం జిల్లా అధ్యక్షుడు వీరారెడ్డి, బీసీ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు ఓంకార్, ఎస్జీటీ ఫోరం అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వెంకట్ రెడ్డి, మైస నాగయ్య, బద్రి నారాయణ, ఎస్ టి యు అధ్యక్షులు ప్రసాద్,మరియు జిల్లా పరిధిలోని భారీ సంఖ్యలో సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విజయవంతంగా ఆల్బెండాజోలు మాత్రల పంపిణీ

**95 శాతం లక్ష్యం పూర్తి 12,303 మందికి గాను 11,689 మంది పిల్లలకు మాత్రలు**

**వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి**





**తొలి సమయంమరిపెడ, జూలై 13:**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం, మున్సిపాలిటీ పరిధిలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఉచితంగా ఆల్బెండాజోలు మాత్రలను పంపిణీ చేశారు. ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది విశేషంగా సహకరించారు. మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో మొత్తం 12,303 మంది పిల్లలను లక్ష్యంగా నిర్ణయించగా, వారిలో 11,689 మంది పిల్లలకు ఆల్బెండాజోలు మాత్రలు పంపిణీ చేసి 95 శాతం లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. మిగిలిన పిల్లలు అనారోగ్యం, గైర్హాజరు తదితర కారణాలతో మాత్రలు తీసుకోలేకపోయారని, వారికి ఈ నెల 20వ తేదీన ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తప్పనిసరిగా మాత్రలు అందజేస్తామని వైద్యాధికారి తెలిపారు. మున్సిపాలిటీ కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన ప్రధాన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ విశారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థినులకు ఆల్బెండాజోలు మాత్రలు అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో నులిపురుగుల నివారణ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని వారు పేర్కొన్నారు. అదేవిధంగా మరిపెడ 12, 13 వార్డులు, పురుషోత్తమాయగూడెం తదితర ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మార్వో కృష్ణవేణి, ఎంపీడీఓ వేణుగోపాల్, మున్సిపల్ కమిషనర్ నరేష్ రెడ్డి, సీడీపీఓ ఎల్లమ్మ, ఎంఈఓతో పాటు ఇతర అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ప్రతి అర్హత కలిగిన బాలబాలిక ఆల్బెండాజోలు మాత్రలు తీసుకునేలా తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి మాట్లాడుతూ, పిల్లల్లో నులిపురుగుల సమస్య వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, శారీరక ఎదుగుదల మందగించడం వంటి సమస్యలు తలెత్తే అవకాశముందని తెలిపారు. ఆల్బెండాజోలు మాత్రలు తీసుకోవడం ద్వారా నులిపురుగుల నివారణతో పాటు పిల్లల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడుతుందని చెప్పారు. అందుకే ప్రతి సంవత్సరం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన పంపిణీ కార్యక్రమాల్లో స్థానిక సర్పంచులు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ, ఆరోగ్య శాఖల సమిష్టి కృషితో మరిపెడ మండలంలో ఆల్బెండాజోలు మాత్రల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా ముగియడం విశేషంగా నిలిచింది.

# మన మహబూబ్ నగర్లోకి ఆధార్ సేవా కేంద్రం వచ్చింది




**తొలి సమయం, వనపర్తి, జులై 13**

ఇక మాదాపూర్ వెళ్లాల్సిన అవసరం లేదు. మన మహబూబ్ నగర్లోకి ఆధార్ సేవా కేంద్రం వచ్చింది. 6 సంవత్సరాల పైన ఉన్నవారికి ఆధార్ కార్డు తీయాలంటే ఇన్నాళ్ళు మాదాపూర్ వెళ్ళాల్సి వచ్చేది. ఇక నుంచి అన్నీ వయసుల వారికి ఆధార్ కార్డు కోసం మహబూబ్ నగర్లో ఆధార్ సేవా కేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. అడ్రస్: టవర్, బజాజ్ షోరూం పైన, ఓల్డ్ ఆఫీస్ దగ్గర, మహబూబ్ నగర్.

# సార్ ప్రక్రియను వేగవంతం చేయండి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి





**తొలి సమయం, వనపర్తి, జులై 13**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి (ఎస్ఎన్ఆర్) అన్నారు. పెబ్బేర్ పట్టణంలోని 3వ, 4వ వార్డుల్లో ఆదివారం ఆయన పర్యటించి కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ ఏజెంట్లకు () దిశానిర్దేశం చేస్తూ, అర్హులైన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అనంతరం బూత్ లెవల్ అధికారి ()తో మాట్లాడి ప్రక్రియ పురోగతి, మరణించిన ఓటర్ల నమోదుతో పాటు ఇతర వివరాల పరిశీలనపై ఆరా తీశారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో సమావేశమై కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకెళ్లి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తదుపరి కల్వరాల గ్రామానికి చెందిన సర్దార్ అనారోగ్యంతో ఉన్నారని తెలుసుకుని వారి నివాసానికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దిలీప్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ కర్రె స్వామి, కౌన్సిలర్లు సౌజన్య, శంకర్ మన్యం, నాయకులు సత్యరెడ్డి, విశ్వరూపం, సాయి రెడ్డి, ఎల్లారెడ్డి, సాయిరామకృష్ణ, సంబు, రాము, సహదేవ్, వడ్డె రమేష్, వీరబోజ శేఖర్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, వేణు, వడ్డె శీను, సురేష్, మహేష్, బసవరాజ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వరరావుకు గౌరవ డాక్టరేట్

**- 19న న్యూఢిల్లీలో ప్రధానం**

**తొలి సమయం కరీంనగర్, జులై 13**



రాష్ట్రంలో పాలు ఉత్పత్తి చేసే రైతుల సాధికారత కోసం చేసిన విశేష సేవలకు గుర్తింపుగా, కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ చలిమెడ రాజేశ్వరరావుకు యూఎస్ఏ మేరీల్యాండ్ స్టేట్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ను ప్రదానం చేసింది. జులై 19న న్యూఢిల్లీలోని లోధి రోడ్‌లో ఉన్న ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లోని గుల్మోహర్‌లో జరిగే కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకోనున్నారు. వ్యవసాయ పట్టభద్రులైన రాజేశ్వరరావు పాడి పరిశ్రమ రంగంలోనూ, రైతుల సాధికారత దిశగానూ అవిశ్రాంత కృషి చేశారు. వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను అదనపు ఆదాయ వనరుగా చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించారు. రాజేశ్వరరావు నాయకత్వంలో కరీంనగర్ డెయిరీ అద్భుతమైన వృద్ధిని సాధించి, పాలు, పాల ఉత్పత్తుల సేకరణ, అమ్మకాల పరంగా తెలంగాణ రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచింది. మార్కెట్ పరిధిని విస్తరించడానికి, రైతుల ఆదాయాన్ని పెంచడానికి దోహదపడేలా ఆయన అనేక కొత్త ఉత్పత్తుల తయారీకి చర్యలు చేపట్టారు. ప్రస్తుతం లక్ష మందికి పైగా రైతులు కరీంనగర్ డెయిరీకి పాలను సరఫరా చేస్తున్నారు. ఈ ప్రాంతంలో పాల ఉత్పత్తిని పెంచేందుకు, రైతులు మరియు పాడి పశువుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను ప్రారంభించడంలో రావు కీలక పాత్ర పోషించారు. 1971లో 12,000 లీటర్ల సామర్థ్యంతో ప్రారంభమైన డెయిరీ, నేడు తిమ్మాపూర్ మండలం నల్లగొండ గ్రామంలోని మెగా డెయిరీ కేంద్రంతో కలిపి 3 లక్షల లీటర్లకు పైగా సామర్థ్యానికి విస్తరించింది. 2020లో ఉత్తమ మధ్య తరహా సంస్థగా ఇండియా డెయిరీ అవార్డు, 2019లో డెయిరీ రంగంలో ఉత్తమ రిటైలర్‌గా ది హన్స్ ఇండియా అవార్డు, 2018లో దేశంలోనే ఉత్తమ నాణ్యమైన పాలు మరియు పాల ఉత్పత్తులకు గాను ఇండియన్ అగ్రికల్చర్ అవార్డు, 2017లో ఉత్తమ పారిశ్రామికవేత్తగా కరీంనగర్ లయన్స్ క్లబ్ అవార్డు, 2014లో ఉత్తమ సామాజిక సేవకు గాను ఒంగోలులోని ఆచార్య ఎన్.జి. రంగా కిసాన్ సంస్థ అవార్డు, 2016లో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి వారి ఉత్తమ రైతు అవార్డు, 2010లో ఉత్తమ సేవల విభాగంలో డాక్టర్ సి. కృష్ణారావు అవార్డులను రాజేశ్వరరావు అందుకున్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

**విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ**



**తొలి సమయం పెబ్బేరు జులై 13పెబ్బేరు:**

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పెబ్బేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆల్బెండాజోలు మాత్రలను పంపిణీ చేసి సేవింపజేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పేగు పురుగుల వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, బలహీనత, ఎదుగుదల మందగించడం, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశముందని తెలిపారు. వీటి నివారణకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ మాత్రలను ఉచితంగా అందజేస్తోందని వివరించారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సూపర్వైజర్లు దామోదర్, లీలమ్మ, అసిస్టెంట్ రాజశేఖర్, ఆశా వర్కర్లు విద్యార్థులకు ఆల్బెండాజోలు మాత్రలను పంపిణీ చేసి సేవింపజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ భద్రాసేన్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వనపర్తి జిల్లా కుమ్మరి సంఘం నూతన అధ్యక్షులు ఎన్నిక



**తొలి సమయం, వనపర్తి, జులై 13**

వనపర్తి జిల్లా కుమ్మరి సంఘ అధ్యక్షులుగా సూగురు రాములు, ప్రధాన కార్యదర్శిగా, సూర్యవంశం పరుశురాముడు. తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం అధ్యక్షులు నడికుడి జయంతి రావు పిలుపు మేరకు వనపర్తి జిల్లా కుమ్మరి సంఘం స్టీరింగ్ కమిటీ నాయకులు బుద్దారం నరసింహ, బొడ్డుపల్లి వెంకటస్వామి, నరసింహ, వనపర్తి టౌన్ అధ్యక్షులు బొడ్డుపల్లి వెంకటయ్య అధ్యక్షతన ఆదివారం రోజు జిల్లా కేంద్రం ప్రవేట్ హాల్ సముదయ ములో జిల్లా అధ్యక్షులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈసమావేశంలో 14 మండలాల, అధ్యక్షులు, గౌరవ అధ్యక్షులు కోశాధికారులు, ప్రధాన కార్యదర్శి లు, కుమ్మరి సంఘం నాయకుల అభిప్రాయంతొ జిల్లా అధ్యక్షులుగా, సూగురి రాములుని ఏకగ్రీవంగా ఏనుకొన్నారు. గౌర అధ్యక్షులుగా సుగురు వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శిలుగా, ఇద్దరు బరిలో ఉండగా, సుగురి పరుశురాంను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. జిల్లా కోశాధికారులుగా సుగురు శ్రీనివాసులు, గుణగంటి స్వామి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. వనపర్తి, జిల్లా ఉపాధ్య క్షులుగా, వైయస్ రాజశేఖర్, సూగురు నరేందర్, కోటయ్య, శేఖర్ మాసన్న, గోవిందు ఏకగ్రీవంగా నియమించారు. జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు, నూతనంగా ఎన్నికైనటువంటి జిల్లా అధ్య క్షులు, ప్రధాన కార్యదర్శి గౌరవ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ఈ సందర్భంగా మాట్లాడుతూ,, ప్రాతి నిత్యం వహిస్తున్నటువంటి కుమ్మరి కులస్తులం ఉండి అందరం ఐఖ్యత లేకపోవడం వల్ల కుమ్మరి కులం వెనుకబాటైందన్నారు. ఇనాటి వరకు జిల్లా బాడి లో కుమ్మరి కుల సంఘం భావనము లేకపోవడం బాధకారమన్నారు, జిల్లా కుమ్మరి పెద్దలు బాటలు వేశారని, వారి



అడుగు జాడల్లో నడుచుకోవాలన్నారు. అందరు ఐక్యతతొ ముందుకు సాగాలన్నారు .జిల్లా యువజన అధ్యక్షులు 14 మండలాల అభిప్రాయం తీసుకొని జిల్లా యువజన అధ్యక్షులుగా ఏర్పాటు చేసుకోవడం కోసం సంసిద్ధం కావాలని 14 మండలాల అధ్యక్షులకు తెలిపారు. గ్రామ స్థాయి నుండి ప్రతిష్టమైన చర్యలు తీసుకుంటే మండల స్థాయితో పాటు జిల్లా స్థాయి



వరకు కుల సంఘాన్ని అభివృద్ధి పథం వైపుకు ముందుకు సాగుతున్నారు. రాజకీయ రంగంలో రెడ్లు, దొరలు, పోలిస్తున్నారంటే, మన కుమ్మరి కులస్థులు ఎ ఒక్కరికి ఐక్యత లేకపోవడం వల్ల రాజకీయ రంగంలోకి రాలేకపోతున్నా మంటే, ఒకరికి ఒకరు ఈర్ష, ద్వేషంతొ దీనికి నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా కుల బంధువులు గ్రామస్థాయి నుండి మండల, జిల్లా స్థాయి వరకు కలిసిమెలిసి అందరూ ఒకేదాటిపై ఉండి మనకు కావాల్సిన హ క్కులను, రావాల్సినటువంటి రాజకీయాల్లో పటిష్టమైన చర్యలు తీసుకొని రాణించాలన్నారు. రాష్ట్ర స్థాయి కమిటి అధ్యక్షులు నడికుడి జయంత్ రావు దృష్టికి తీసుకేళి కుమ్మరి కుల బంధు వుల రాష్ట్రస్థాయిలో ఉన్నటువంటి కుమ్మరుల గణనీయంగా పెరిగిందని, ఈ రాష్ట్ర ప్రభుత్వంకు గుర్తుచేసేలా చట్టసభలో కుమ్మర్లు రానివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో 14 మండలాల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు గౌరవ అధ్యక్షులు కోశాధికా రులు నూతనంగానికైనటువంటి, జిల్లా బాడీలో ప్రచార కార్య దర్శిలు, కార్యదర్శులు, మీడియా ఇన్చార్జి ఎలక్ట్రాన్ మీడియా, ప్రింట్ మీడియా తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# తగ్గిన వర్షాలతో రైతుల ఆందోళన.. ప్రభుత్వం ఆదుకోవాలి: రాబర్ట్

**తొలి సమయం, వనపర్తి, జులై 13**



ఎల్ నినో ప్రభావంతో తగ్గిన వర్షాలతో సాగుపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేయాలని తెలంగాణ రాష్ట్ర సంఘం వనపర్తి జిల్లా కార్యదర్శి రాబర్ట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పిలుపుమేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రం 17 జిల్లాలలో లోటు వర్షపాతం నమోదయిందన్నారు. వనపర్తి జిల్లాలో వర్షాలు తగ్గటంతో 7.39 శాతం భూమి సాగు అయిందన్నారు. పడిన కొద్దిపాటి వర్షాలకే పత్తి కంది తదితర మెట్ట పంటలను వేసినా మొలకెత్తక నష్టపోయారన్నారు. భూగర్భ జలం తగ్గటంతో బోర్లు కూడా నీరు ఇవ్వని పరిస్థితి కనిపిస్తోందని, వరికి బదులు ప్రత్యామ్నాయంగా మెట్ట పంటలు పండించే రైతులకు ఎకరాకు రూ. 8000 ప్రోత్సాహక నగదు అందజేయాలన్నారు. నకిలీ కల్తీ విత్తనాలతో రైతులు నష్టపోతున్నారని, మెట్ట పంటల సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. పంట మార్పిడి కోసం అవసరమైన చర్యలు అవగాహన కల్పించాల న్నారు. పండించిన మెట్ట పంటకు గ్యారెంటీగా మద్దతు ధర లభించేందుకు మార్కెట్ శక్తులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. రైతుల పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసి అన్ని స్థాయిల్లో ఆదుకునేందుకు యంత్రాంగాన్ని సిద్ధం చేయాలన్నారు. జిల్లాకు కే ఎల్ ఐ భీమా జూరాల ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించే చర్యలు తీసుకోవాలన్నారు. పాలమూరు రంగారెడ్డి మొదటి మోటారు వెట్ రన్ కు అధికారులను సీఎం ఆదేశించారని, ఇది శుభ పరిణామమని, అలాగే ఇతర ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించే అవకాశాలను పరిశీలించాలన్నారు. రైతాంగ సమస్యలపై నిర్లక్ష్యం చేస్తే రైతులను సమీకరించి ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. నేతలు రమేష్, యూసుఫ్, వంశీ పాల్గొన్నారు.

# వర్షాలు కురవాలని శివలింగాలకు జలాధివాసం

**రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక పూజలు**

**తొలి సమయం పెబ్బేరు జులై 13**



మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని దేవాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. శ్రీ శ్రీ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంతో పాటు హిందూ జాగృతం ఆధ్వర్యంలో శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలోని శివలింగానికి కూడా ప్రత్యేక పూజలు, మహారుద్రాభిషేకాలు, జలాధివాస కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ పక్ష చతుర్దశి, ఆరుద్ర నక్షత్రం ఒకే రోజు రావడం విశేషమని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. తెల్లవారుజామునే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉదయం 5 గంటల నుంచే అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య మహారుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం రాష్ట్రంలో, జిల్లాలో, గ్రామాల్లో సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలగాలని సంకల్పిస్తూ జలాధివాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.

**జలాధివాసం అంటే ఏమిటి?**

జలాధివాసం అనేది ఆగమ శాస్త్రాల్లో పేర్కొన్న విశిష్ట ఆధ్యాత్మిక క్రతువులలో ఒకటి. ఇందులో శివలింగాన్ని లేదా దేవతా విగ్రహాన్ని పవిత్ర జలంతో పూర్తిగా ఆవరించి కొంత సమయం పాటు నీటిలో ఉంచి ప్రత్యేక మంత్రోచ్చారణలతో పూజలు నిర్వహిస్తారు. ఇది ప్రకృతి సమతుల్యత, వర్షాల అనుగ్రహం, లోకక్షేమం, పంటల సుభిక్షం, ప్రజల శాంతి, సౌభాగ్యం కోసం చేసే విశేష ఆరాధనగా భావిస్తారు. తీవ్రమైన ఎండలు, వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పుడు శివుని ప్రసన్నం చేసుకునేందుకు అనేక ప్రాంతాల్లో ఈ జలాధివాసాన్ని నిర్వహించే సంప్రదాయం ఉంది. పెబ్బేరులోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో హిందూ జాగృతం ఆధ్వర్యంలో శివలింగాన్ని పూర్తిగా పవిత్ర జలంలో ముంచి జలాధివాసం నిర్వహించారు. శివభక్తులు ఓం నమఃశివాయ, హర హర మహాదేవ నామస్మరణలతో భక్తిపారవశ్యంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరూ మంచి వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. చిన్నారులు, మహిళలు, యువకులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో రెండు ఆలయాల ప్రాంగణాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు, హిందూ జాగృతం ప్రతినిధులు తగిన ఏర్పాట్లు చేసి సేవలు అందించారు. ఈ కార్యక్రమాల్లో శివభక్తులు, ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, హిందూ జాగృతం నాయకులు, గ్రామ పెద్దలు, యువత మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని శివారాధనలో భాగమయ్యారు. మాస శివరాత్రి సందర్భంగా నిర్వహించిన ఈ మహారుద్రాభిషేకాలు, జలాధివాస కార్యక్రమాలు భక్తిపారవశ్యంతో విజయవంతంగా ముగిశాయి.

# నూతన శాలివాహన సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

**- జిల్లా ప్రధాన కార్యదర్శిగా సూర్యవంశం పరుశ రాముడు**

**తొలి సమయం పెబ్బేరు జులై 13**



తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం అధ్యక్షులు నడికుడి జయంతి రావు ప్రధాన కార్యదర్శి. పిలుపు మేరకు వనపర్తి జిల్లా శాలివాహన సంఘం స్టీరింగ్ కమిటీ నాయకులు బుద్దారం నరసింహ, బొడ్డుపల్లి నరసింహ వెంకటేష్. వనపర్తి టౌన్ కమిటీ అధ్యక్షుడు బొడ్డుపల్లి వెంకటయ్య ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో జిల్లా కమిటీ ఎన్నుకోవడం జరిగింది. పెబ్బేరు మండలానికి చెందిన సూర్యవంశం పరుశ రాముడు, ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా ప్రధాన కార్యదర్శి పరుశ రాముడు మాట్లాడుతూ....పూర్వకాలం నుంచి చేతివృత్తి ద్వారా కుమ్మరి శాలివాహనులు ఎంతో ప్రాముఖ్యత సాధించారని, ప్రస్తుతం ఆదరణ కరువవడంతో చాలా కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ప్రభుత్వం కుమ్మరి శాలివాహనుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. వృత్తి పరంగా తయారయ్యే మట్టి పాత్రలు వంటివి ఉపయోగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మిగిలిన సామాజిక కార్పొరేషన్లకు మంజూరు చేసే విధంగానే శాలివాహన కార్పొరేషన్కు నిధులు మంజూరు చేయాల న్నారు. కుమ్మరి కులస్తులందరం ఐఖ్యత లేకపోవడం వల్ల కుమ్మరి కులం వెనుకబాటైందన్నారు. ఈనాటి వరకు జిల్లా కేంద్రంలో శాలివాహన సంఘం భవనం లేకపోవడం బాధకారమన్నారు, జిల్లా కుమ్మరి పెద్దలు బాటలు వేశారని వారి అడుగు జాడల్లో నడుచుకోవాలన్నారు. అందరు ఐక్యతతొ ముందుకు వెళ్లాలన్నారు. నాపై నమ్మకంతో నూతనంగా శాలివాహన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక చేసిన పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

# ప్రైవేటు పాఠశాల ఫీజులపై సర్వే నివేదిక అందజేసిన సిపిఎం ఎంఈఓకు వినతిపత్రం



**తొలి సమయం పెబ్బేరు జులై 13**

పెబ్బేరు మండల కమిటీ ఆధ్వర్యంలో జులై 13 సోమవారం రోజు పెబ్బేరు మండల విద్యా అధికారి ఎంఈఓ గారికి సిపిఎం పార్టీ ప్రతినిధి బృందం పెబ్బేరు మండలంలో ఉన్న ప్రైవేటు విద్యాసంస్థలపై సర్వే నిర్వహించడం జరిగింది . సర్వేలో వచ్చిన సమస్యలను సిపిఎం పార్టీగా ఎంఈఓ జయ రాములు గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది అనంతరం సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మండ్ల రాజు సిపిఎం కార్యదర్శి మాజీ ఎంపీటీసీ జి బాలయ్య మాట్లాడుతూ పెబ్బేరు మండలంలో ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తూ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంగిస్తూ ఇష్టారాజ్యంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ పేద విద్యార్థుల తల్లిదండ్రులను పీడిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు ఒకటో తరగతి నుంచి మూడో తరగతి వరకు 21 వేల రూపాయలు నాలుగో తరగతి ఐదో తరగతి విద్యార్థులకు 30 వేల రూపాయలు పైతరగతులకు 50 వేల నుండి 60 వేల రూపాయల వరకు అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నారు పాఠ్యపుస్తకాల పేరుతో వేల వేల రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నారు స్కూల్ యూనిఫాంలో పేరుతో ప్రైవేటు పాఠశాల యజమాన్యమే వ్యాపారాలు చేస్తూ వేల రూపాయలు గడిస్తున్నారు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారు కోర్టు తీర్పు 25 శాతం పేద విద్యార్థులకు ఉచిత విద్య అమలు చేయాలి కానీ వాటిని నిబంధనలకు ప్రైవేటు విద్యాసంస్థల యజమానులు పాటించటం లేదు నిబంధనల ప్రకారం ప్రైవేటు విద్యాసంస్థలు ఏ తరగతి విద్యార్థికి ఎంత ఫీజు తీసుకోవాలో నోటీస్ బోర్డులో రాయాలని కోరారు ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీకి వ్యతిరేకంగా విద్యార్థుల తల్లిదండ్రులతో సిపిఎం పోరాటాలు ఉధృతం హెచ్చరించారు ఈ సిపిఎం నాయకులు ఆర్ భాస్కర్ ఎం వెంకటస్వామి పి ఊసన్న జి మన్యం తదితరులు పాల్గొన్నారు

# మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి సుడిగాలి పర్యటన

**సర్ సమీక్ష గ్రామాల్లో పూజలు**



**తొలి సమయం పెబ్బేరు జులై 13**

మాజీ వ్యవసాయ శాఖ మంత్రి, వనపర్తి అభివృద్ధి ప్రదాత శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గారు ఈ రోజు పెబ్బేరు మండలంలోని సూగూరు, బున్యాదిపూర్, రంగాపూర్ గ్రామాల్లో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ముందుగా పాత సూగూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ప్రజలతో మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని పరమ శివుడికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పార్టీలు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని ప్రతి అర్హుడైన ఓటరికి న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు. తదుపరి రంగాపూర్ గ్రామంలో కార్యక్రమాన్ని పరిశీలించి, కార్యక్రమం పురోగతిపై పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బున్యాదిపూర్ గ్రామంలో కార్యక్రమాన్ని మండలంలోనే అత్యధికంగా విజయవంతంగా పూర్తి చేసి మొదటి స్థానంలో నిలిచినందుకు గ్రామ సర్పంచ్ విజయ్ గౌడ్ గ్రామ కార్యదర్శిని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఘనంగా శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధిలోప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు సమన్వయంతో పనిచేస్తూ ఇదే సేవాస్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పాల్గొన్న వారు మండల అధ్యక్షులు వనం రాములు ముఖ్య నాయకులు పెద్దింటి వెంకటేష్, కర్రె స్వామి, రాజశేఖర్, ఎల్లారెడ్డి, సహదేవుడు, వడ్డె రమేష్, మొగులయ్ సర్పంచులు నారమ్మ, హేమలత, కృష్ణారెడ్డి, యాదమ్మ, పర్శరాం, విజయ్ గౌడ్ వివిధ గ్రామాల ముఖ్య నాయకులు వేణు రెడ్డి దేవేందర్ రెడ్డి కాంతరెడ్డి కృష్ణారెడ్డి వెంకటస్వామి గట్టు కృష్ణ హుస్సేన్ హనుమన్న శీను మధు తదితరులు గ్రామ నాయకులు బిఎల్ఏలు మరియు పార్టీ కార్యకర్తలుపాల్గొన్నారు.